



# పరిష్కారం

రచన:
అనిపెద్ది వెంకట రమణారావు

ఆమె అకస్మాత్తుగా తనను చంపడానికి వస్తున్న అతనిచూచి, అతని కత్తి నుండి తప్పించుకొని వంటింటి తలుపు గడియ తీయడానికి ప్రయత్నిస్తోంది. ఆమెకళ్ళు, తనని చంపాలనే దృఢ నిశ్చయంతో ముందుకువచ్చే అతనివైపే నిశ్చలంగా చూస్తున్నాయి. అతని కళ్ళు మాత్రం విచారంతో కూడిన నిస్పృహ వెడలగక్కుతున్నాయి.

భయంతో ఆమె ఒక్క గావుకేక పెట్టింది. కాని ఆ కేక గంభీరంగా తన వైపే వస్తున్న అతనికతప్ప మరెవ్వరికీ వినిపించలేదు. ఒణుకుతున్నచేతులతో తలుపు గడియతీసి చీకటిలోకి దూకి పరుగెత్తసాగింది మృత్యువునుండి తప్పించుకుని బయటపడాలనే ఆశతో. మృత్యువుకూడా వెంటాడింది. అక్కడొక బండరాయితగిలి క్రిందపడివుండక పోతే, పాపం తనప్రయత్నంలో కృతార్థురాలయ్యేదే

"నన్ను చంపదలిస్తే చంపెయ్యి" అంది సమీపించిన అతన్నిచూసి ఆవేశంతో. తాను జీవించి, మరునాడే వివాహమాడబోయే ఆమె ప్రియునితో హాయిగా జీవితాన్ని గడపాలని మనసు గాఢంగా కోరుతోంది. కాని, ఎందుకో, అతను ఆ కోరికనుండి ఆమెను దూరం చేసితీరాలని పట్టుబట్టాడు. అతను చెయ్యదల్చుకున్నది ఒప్పుకోవడంతప్ప వేరే గత్యంతరం లేకపోయింది ఆమెకు.

"నిన్ను పెళ్లిచేసుకోవడంకన్నా చావడమే మేలు" అంది నిష్కర్షగా.

"అయితే దానికిదే మార్గం" అన్నాడతను తళతళ మెరిసేకత్తిని చూపిస్తూ. "నిన్ను వదలి, నీ జీవితం నాశనం కావడం నేను చూడలేను. రేపు నీకూ అతనికీ జరుగబోయే యీ పెళ్లిని ఆపడానికి ఎన్ని ప్రయత్నాలు చేసానో భగవంతుడికి తెలుసు. ప్రేయసీ! నిన్ను మనసారా గాఢంగా ప్రేమిస్తున్నాను. నీ సుఖంకోసం నా ప్రేమని, జీవితాన్ని కూడా త్యాగం చెయ్యగలను. కాని, నువ్వు అతనితో ఏమాత్రమైనా సుఖం అనుభవిస్తావని ఒక్క క్షణమైనా నేను నమ్మగలిగితే యీ పనికి పూనుకొనే వాణ్ణికాదు. ఏం జేస్తాం! విధి బలీయం కదా! త్వరలో మనిద్దరం స్వర్గంలో కలుసుకుందాం"అన్నాడతను గుండెలు చీల్చుకువచ్చే ఆవేదన వ్యక్తపరుస్తూ.

ఒక్కటే ఒక్క బరువైన మూలుగు ఆకాళరాత్రి నిశ్శబ్దాన్ని చీల్చుకొని గాలిలో కలిసిపోయింది. అంతే! తర్వాత అంతా నిశ్చలంగాను, ప్రశాంతంగాను ఉండిపోయింది.

* * *

హల్లో! కమలా! రవిగారు ఇంకా రాలేనట్టుందే" అంది లీల లోనికి ప్రవేశిస్తూ తన వాచీ చూసుకుంటూ. అప్పటికే ఆఫీసు గడియారంప్రకారం ఆమె అరగంటలేటు.

"అరె వింతగా ఉందే! ఈరోజు రవిగారు ఇంకా రాలేదేమో! రోజూ పది నిమిషాలుముందేగాని ఆలస్యంఎప్పుడూ కాదే! పోనీలే నీ గండం తప్పింది. లేకపోతే యీపాటికి విరుచుకుపడేవాడు. సంజాయిషీ యిచ్చుకోలేక చావాలి" అంది కమల.

"రీటా వచ్చిందా?"

"లేదు"

"అరె! ఇది మరీ వింతగా వుందే" అంది లీల తన టైపురైటర్ దగ్గిర కూర్చుంటూ" ఇది విన్నావా కమలా? నిన్న సాయంత్రం రవిగారి ఆఫీసురూం ప్రక్కగా వెడుతుంటే అతను రీటాతో ఏదో ఘర్షణ పడుతున్నట్లనిపించి ఆగాను. ఆయనగారు "రీటా! రావు శీలం ఎటువంటిదో తెల్సింటే యీపనికి సిద్ధపడే దానవు కాదు. అతన్నిమాత్రం నీ జీవితంలో ప్రవేశపెట్టకు. నీ కిష్టం లేకపోతే నేను నిన్నెంత గాఢంగా ప్రేమిస్తున్నానో అంత దూరంగా నీ దృష్టిలోంచి పోతా. నిన్నసలు చూడడమే మానేస్తా" అన్నాడు. సరిగా యివేమాటలు. నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాను" అని సాలోచనగా కమలవైపు చూసింది.

"ఆమెను ప్రేమించాడా? రవి!?" ఆశ్చర్యపడింది కమల. "అసలతనికి ఆడవాళ్లంటేనే గిట్టదనుకున్నా అతని వరసచూసి. అయితే ఫర్వాలేదు. రీటా అదృష్టవంతురాలే. పైకి కొంచెం కరుకుగా కన్పించినా అందమైనవాడూ, మంచి హృదయంగలవాడూనే" అంది.

ఆమెమాట కడ్డువస్తూ "కాని, రీటా అతన్ని ఏమాత్రం ప్రేమించడంలేదే! తను రావునే ప్రేమిస్తున్నానని అతనితో ఖచ్చితంగాచెప్పిందికూడా" అంది లీల.

"రావును ప్రేమిస్తోందా?" అని చీదరించుకుంది కమల.

"రావునుగురించి రవి అట్లా చెప్పడంలో అర్థంలేకపోలేదు. రావు నిజస్వరూపం గ్రహించలేక మోసపోయిందన్నమాట రీటా. అందుకే ప్రేమ గుడ్డిదన్నారు. వంటిమీద బట్టలు మార్చినట్లుగా అమ్మాయిల చేతులు మారుస్తాడు అతను. తుంటరి, త్రాగుబోతూ కూడాను......"

"ఇష్ష్ రావు వస్తున్నాడు" సైగ చేసింది లీల.

"హల్లో డార్లింగ్స్! ఏమిటి మహ దీర్ఘంగా ఆలోచిస్తున్నారు. ఇది విన్నారా? ఈరోజు నేను రీటాను పెళ్లిచేసుకోబోతున్నాను. అన్నట్లు రీటా వచ్చిందా? ఇంకా రాలేదా? ఆ కటికిబాస్ రవికోసం శ్రమపడి యీ ఆఫీసులో యింక పని చెయ్యక్కరలేదు" అన్నాడు రవి ప్రవేశిస్తూ.

"పెళ్లిచేసుకుంటున్నారా? ఈరోజే" అన్నారిద్దరూ ఒకే గొంతుతో ఆశ్చర్యపోతూ.

"ఏం? దద్దమ్మల్లా అల్లా కంగారు పడిపోతారేమిటి? ఒక యువకుడు ఒక యువతిని పెళ్లి చేసుకోవడం మీకు వింతగా ఉందా?" అన్నాడు రావు పీల్చిన సిగరెట్ పొగ విడుస్తూ.

అట్లా అంటూ రీటాగదివైపు వెళ్లబోతూండగా, కమల ఆశ్చర్యాన్నించి తేరుకుని "రీటా యింకా రాలేదు. రవిగారు కూడా రాలేదు" అంది.

రావు మొహం అదోరకంగా మారింది. సన్నగా గొణుక్కున్నాడు "రీటా—రవి ఇంకా రాలేదా?" అంటూ స్ప్రింగ్ డోర్ని విసురుగా తోసుకుని బయటకు చరచరా నడచాడు.

'బాగుంది! రీటా ఇంత తెలివి తక్కువదని కల్లోగూడా అనుకోలేదు" అంది కమల నిట్టూరుస్తూ. "నేనే రవినైతే ఎట్లాగైనాసరే యిది జరగకుండా అపుచేసేదాన్ని" అంది సాలోచనగా.

"నేను రీటానైతే రావుని పెళ్లిచేసుకునేకన్నా నుయ్యో గొయ్యో చూసుకొనేదాన్ని" అంది లీల అందుకుంటూ. "అందుకే కాబోలు విధి బలీయం అంటారు. ఏమో ఎవరికి తెలుసు. అనాఘ్రాతపుష్పాన్ని పూర్తిగా ఆఘ్రాణించి, ఇంకో అనాఘ్రాతం దొరికితే దీన్ని అవతల విసిరికొట్టవచ్చు. ఛీ! కామాంధుడు" అంది మొహం చిట్లించుకుంటూ.

"తిరిగే కాలు, ఆడేనోరు ఊరుకోదంటారుగా" సూత్రీకరించింది కమల.

రావు రీటాయింటివైపు ఖంగారుగా బయలుదేరాడు. అదెక్కడో ఓచివరగా, ఊరికొమూల వుంది. ఆమెకు ఆయిల్లు కొంతసొమ్ము వ్రాసిపోయాడు తండ్రి. ఆ సంగతి రావుకు తెలుసు. కాని ప్రస్తుతం రీటా, రవి యిద్దరూ కలసి ఎక్కడికో పోయివుంటారనే ఆలోచన అతన్ని ద్వేషాగ్నితో దహించేస్తోంది. పిచ్చెక్కినవాడిలాగ తయారయ్యాడు. రవి రీటాను ప్రేమిస్తున్నసంగతి తనకు తెలుసు. కాని తనూ ప్రేమిస్తున్నాడుగా. ఒక అరలో రెండు కత్తులెట్లా యిముడుతాయి. పైగా తాను జీవితంలో, ఏ ఏ అమ్మాయికైనా విలువ యిచ్చివుంటే ఆమె రీటాయే. తనచేతిలో ఎంతోమంది నలిగారు. కాని ఏ ఒక్కర్ని పెళ్ళి చేసుకోలేదు. పెళ్ళిచేసుకుంటా నన్నదీ కాస్త హృదయమంటూ యిచ్చిందీ మొదట యీమెకే.

రీటా యింటికి చేరి కాలింగ్‌బెల్ నొక్కాడు. సమాధానం రాలేదు. అట్లా దొడ్డివైపు వెళ్ళి చూసాడు. వంటింటి తలుపులు బార్లా తెరిచివున్నాయి. ఒకవేళ రీటాపనిమనిషి వచ్చిందేమోనని వాచీవైపు చూసాడు. ఆమె 10 గంటలకుగాని రోజూరాదు. అప్పటికి తొమ్మిదేగా అయింది. ఏమో కొంచం త్వరగా వచ్చిందేమోనని లోపలకు వెళ్లాడు. ఎవరూ కన్పించలేదు, ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. "రీటా" అన్నాడు బిగ్గరగా. ఆ కేక ప్రతిధ్వనితప్ప ఇంకే సమాధానం రాలేదు. గాభరాపడుతూ మళ్లీ బయటికివచ్చి నిన్నరాత్రి రీటా హంతకుణ్ణి తప్పించుకునివెళ్ళినదారినే వెళ్లాడు యాదృచ్ఛికంగా అతని మనసు మనసులో లేదు. ఈ ప్రపంచాన్నే పూర్తిగా మరచినట్లున్నాడు. కాళ్లకేదో మెత్తటిపదార్థం తగలడంతో యీ లోకములో పడ్డాడు. క్రిందికివంగిచూసాడు. గుండెల్లో గుండెలు లేవు బేజారెత్తిపోయాడు. కళ్ళు నమ్మలేక యింకా పెద్దవి చేసి చూసాడు. ఇంకేముంది రీటామృతకళేబరం!! ఆ దృశ్యంచూసి భరించలేకపోయాడు.

"రీటా" అని గద్గదస్వరంతో అరుస్తూ ఆమెప్రక్క మోకాళ్లపై అనుకునికూలబడిపోయాడు. ఆమె హత్య చెయ్యబడింది. ఒక్క పోటుతోనే ప్రాణాలు అనంతవాయువులో లీనమైనట్లు ఖచ్చితంగా కనబడుతోంది. అతని కళ్ళనుంచి నీరు జలాజలా కారడం ఆరంభించింది. తన జీవితంలో కంట తడి పెట్టడం అదే మొదటిసారి. "ఎవరు? ఎవరు చేసా రీపని" అంటూ రెండు మూడుసార్లు గట్టిగా అరిచాడు కారణం యేమైనా అంతుపడుతుందేమో నని ఆటూ యిటూ కలయజూస్తున్న అతనికి ఇంకొక కళేబరం ప్రక్కనేకనిపించింది.

"ఆఁ! రవి!!" అన్నాడు బిగ్గరగా, అదరిపోయేటట్లు ఆ కళేబరాన్ని గుర్తిస్తూ, పరిస్థితులన్నీ ఒక్కొక్కటే సావధానంగా అర్థంచేసుకోవడం ప్రారంభించాడు. "రవీ! ఎంత మంచి హృదయము నీది! నాకు తెలుసు! ఇది ఆమె మంచికే చేసావు! ఆమె వివాహమాడబోయే వ్యక్తి ఎటువంటి నీచుడో నువ్వు బాగా గ్రహించావు కాని, ఎవరికి తెల్సు! రీటాను వివాహమాడి నేను ప్రవర్తన పూర్తిగా మార్చుకోదలచానని? రీటా! రవీ! మీరు అమరజీవులు! భగవంతుడు మీ ఆత్మలకు శాంతి చేకూర్చుగాక" అన్నాడు భోరున యేడుస్తూ, పూర్తిగా పశ్చాత్తాపపడుతూ.

అక్కడనుండి లేచి, గ్రుడ్డివానిలాగ నడవడం ప్రారంభించాడు. జీవితంలో యేదో అమూల్యమైన నిక్షేపాన్ని జారవిడిచినవాడిలా వెర్రిచూపులు చూస్తూ నడుస్తున్నాడు. రోడ్డుమళుపుతిరిగాడు. తిరుగుతున్న మెదడులో, యెక్కడికి పోతున్నాడో తనకే తెలియటం లేదు! శరీరం స్వాధీనంలోలేదు. ఆ అస్వాధీన స్థితిలో విసురుగా అదేమార్గాన మళుపు తిరుగుతున్న ఒక కారును తీవ్రంగా ఢీకొన్నాడు. అంతే! మరుక్షణంలో ఆ కారు ముందుచక్రం తలమీద ఎక్కడం అతనిలో ప్రాణవాయువులు తన పశ్చాత్తాపాన్ని రవి-రీటాలకు తెలియజెయ్యడానికి అనంతాకాశంలో లీనమయి పోవడం ఒకేసారి జరిగాయి. ★

(ఒక ఆంగ్లకథ ఆధారంగా)